వాస్తవాలు పలుకు DD9 వార్త
తెలుగు దినపత్రిక
మంగళవారం 26-05-2026

## ఫీజుల దోపిడీపై పిడిఎస్‌యూ సమరభేరి

- తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి
- ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలు
- భద్రాద్రి కొత్తగూడెంలో విస్తృతంగా సంతకాల సేకరణ




4



# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భానుడి భగభగలు..

- నిప్పుల కొలిమి లా భద్రాద్రి కొత్తగూడెం..
- ఉక్కపోత తో ప్రజలు ఉక్కిరి బిక్కిరి..
- రెడ్ జోన్ గా ప్రకటించిన వాతావరణ శాఖ..
- అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచన..



3

మణుగూరు.మే 25(డి డి 9వార్త)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత వారం రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు అసాధారణంగా 45°C దాటి నమోదవుతుండడంతోపాటు తీవ్రమైన వడగాలులు వీస్తుండడంతో భద్రాద్రి జిల్లా వాసులు తీవ్రమైన ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం పది గంటలకల్లా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయి ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒకవైపు పరిశ్రమలు, మరోవైపు సింగరేణి బొగ్గుగనుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి.



4

## నిర్మాణం సరే...
### అనుమతుల మాటేమిటి సారు..?

- బుద్వేల్ గ్రీన్ సిటీలో భారీ భవన నిర్మాణం
- అనుమతులపైఅనుమానాల మేఘాలు
- టౌన్ ప్లానింగ్ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారా..?
- నిబంధనలు పక్కన పెట్టి యథేచ్ఛగా పనులు కొనసాగుతున్నాయంటూ స్థానికుల ఆగ్రహం

## మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు వెళుతున్న ఎమ్మెల్యే పాయం..



- నర్మదా గ్రామ సమైక్య భవనానికి 10లక్షల రూపాయలు మంజూరు..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు & అధికారులు..

2




# ప్రజా రవాణాను అడ్డుకోవడం సరైంది కాదు – రోడ్డు సమస్య వెంటనే పరిష్కరించాలి సిపిఎం నేత గార సదక్రిన్

**వాజేడు మే 25 (డిడి9 వార్త):**
ములుగు జిల్లా వాజేడు మండలం చేరుకూరు నుండి ధర్మవరం వరకు ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని, అటవీశాఖ అడ్డంకులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ధర్మవరం రహదారిపై ప్లేకార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా మంత్రి సీతక్క అటవీశాఖ అధికారులతో చర్చించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నాయకులు కోరారు.

ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యుడు గార సదక్రిన్ మాట్లాడుతూ, గత అనేక సంవత్సరాలుగా ప్రజలు గుంతలమయమైన రహదారిలో తీవ్ర ఇబ్బందులతో ప్రయాణం చేస్తున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సమస్య పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్, జిల్లా మంత్రి సీతక్కకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు. నాలుగు గ్రామపంచాయతీల ప్రజలు రవాణా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికార-ప్రతిపక్ష నాయకులు స్పందించడం లేదని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ రావాలన్నా, విద్యార్థుల కోసం స్కూల్ బస్సులు నడవాలన్నా ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. భారీ వాహనాలు ఎదురైతే పక్కకు తప్పుకునే స్థలం కూడా లేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే బాధిత గ్రామాల బంద్‌తో పాటు రోడ్డు దిగ్బంధనానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గౌరాపు చంద్రశేఖర్, బలుసుపాటి నరేష్, ముట్టే బోయిన మహేందర్, కుర్సం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యాలయాల్లో మౌళిక వసతులు కల్పించాలి

- **రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి సంతోష్**



**భద్రాచలం, మే 25, డిడి9 వార్త**
గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాలు, పీఎంహెచ్ వసతిగృహాలలో మౌళిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి సంతోష్ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న పాఠశాలలు, వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, పి ఎం హెచ్ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు చదువుతోపాటు అన్ని వసతి సౌకర్యాలు కల్పించడానికి నిధులు విడుదల అయినందున సంబంధిత డిటిడివోలు తప్పనిసరిగా విద్యార్థినీ విద్యార్థుల పోస్ట్మెట్రిక్ స్కాలర్షిప్ పెండింగ్ లేకుండా అన్ని కళాశాలలలో చదువుతున్న పిల్లలకు అందే విధంగా చూసి కళాశాల నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని అలాగే జెన్ భాగి దారి అభియాన్ పథకం కింద మారుమూల గిరిజన గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాల సంబంధించిన ప్రతిపాదనలు త్వరితగతిన పంపించాలని అన్నారు. అలాగే గిరిజన సంక్షేమ శాఖ డీలు, డిఇలు ,ఏఈలు కేంద్రం మరియు స్టేట్ గవర్నమెంట్ ద్వారా విడుదలయ్యే 275 ఆర్టికల్ కింద మంజూరైన నిధులతో ఈ సంవత్సరం 100% అన్ని పాఠశాలల్లో ముఖ్యంగా బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు మరియు టాయిలెట్లు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పివిటిజి అధికారి గన్యా నాయక్, సిబ్బంది కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు వెళుతున్న ఎమ్మెల్యే పాయం..

- **నర్మదా గ్రామ సమైక్య భవనానికి 10లక్షల రూపాయలు మంజూరు..**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు & అధికారులు..**

**మణుగూరు.మే 25 (డి డి 9వార్త)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం,సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధి లోని 1వవార్డు వాగు మల్లారం గ్రామంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారి ఆదేశాల మేరకు 10లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నర్మదా గ్రామ సమైక్య భవనానికి భూమి పూజ & శంకుస్థాపన కార్యక్రమం సోమవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్ మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని, మహిళలను ఆర్థికంగా,సామాజికంగా ఉన్నత స్థానంలో ఉంచడమే ధ్యేయంగా వారు పనిచేస్తున్నారని.అందులో భాగంగానే వాగు మల్లారం 1వ వార్డులో 10లక్షల రూపాయలతో నర్మదా గ్రామ సమైక్య భవనానికి భూమి పూజ చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా గ్రామ సమైక్య మహిళలు మాట్లాడుతు ఎమ్మెల్యే గారి కృషిని అభినందించి ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీ ఓ పల్నాటి వెంకటేశ్వరరావు, APM సత్యనారాయణ, సీసీలు మురళి, లక్ష్మీకాంత, పిఆర్ ఏఈ కర్నే వంశీ, పంచాయతీ కార్యదర్శి డి శ్రీకాంత్, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం రవి, బుర్ర సదానందం, జుకంటి వెంకటాచారి, కాకర్లపూడి సుబ్బరాజు, త్రివేణి, సావిత్రి మరియు స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# "99" రోజుల ప్రణాళికలో భాగంగా పోషకాహార వంటకాల ప్రదర్శన

- **గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు అవగాహన కల్పించిన అంగన్వాడీ సిబ్బంది**

**గోవిందరావుపేట, మే 25 (డి డి 9 వార్త)**
పసర గ్రామపంచాయతీ పరిధిలోని పసర నాలుగో అంగన్వాడీ కేంద్రంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రత్యేక ఆహార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో గర్భిణీలు, బాలింతలు, తల్లులు మరియు అంగన్వాడీ పరిధిలోని లబ్ధిదారులకు వివరించారు.

ఈ సందర్భంగా నువ్వులు, బెల్లం, పల్లీలతో పోషక ఉండలు, పులగం, బెల్లం బియ్యం, పాలు-పల్లీలతో ప్రత్యేక వంటకాలు, బాలామృతం ఇడ్లీ, బాలామృతం లడ్డూ, బెల్లంతో మొరమరాల ఉండలు, రాగి-కొర్రల జావ తదితర ఆరోగ్యకరమైన వంటకాలను తయారు చేసి చూపించారు.

పిల్లల ఎదుగుదలకు, గర్భిణీలు మరియు బాలింతల ఆరోగ్యానికి ఇలాంటి పోషకాహారం ఎంతో అవసరమని అంగన్వాడీ సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ ఆయాలు, తల్లులు ఉత్సాహంగా పాల్గొని వంటకాలను స్వయంగా తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పి. రాజ్యం, ఏ. కల్పన, కే. రాధిక, ఉపాధ్యాయులు పద్మారాణి, పద్మావతి, భాగ్య, సరిత, రమాదేవి, జ్యోతి మరియు పలువురు తల్లులు పాల్గొన్నారు.

# హార్ట్ ఎటాక్ తో కండక్టర్ మృతి

- **లక్ష్మీదేవి పేటలో విషాదఛాయలు**



**డి డి 9 వార్త, ములుగు :**
వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన బీరెల్లి శంకర్ ఆర్టీసీ కండక్టర్ గా విధులు నిర్వహిస్తూ సోమవారం హార్ట్ ఎటాక్ తో మరణించడంతో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్న వ్యక్తిగా అందరితో కలిసి ఉండేవారని గ్రామంలో ఎలాంటి సామాజిక కార్యక్రమాలు జరిగిన ముందుండే వ్యక్తిగా గుర్తింపు పొందారు. అలాంటి వ్యక్తి మరణించడం పట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# జనగామ జిల్లాలో గ్రంథాలయ శాఖ అధికారుల సమీక్ష సమావేశం

**జనగామ,మే 25(డిడి 9 వార్త ) బ్యూరో**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలోని సుమారు 1138 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు చర్యలు చేపడుతోంది.

ఈ నేపథ్యంలో జనగామ జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటులో గ్రంథాలయ శాఖ పాత్ర, చేపట్టాల్సిన కార్యాచరణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కార్యదర్శి ఎం. సుధీర్, లైబ్రేరియన్ రాంచందర్‌తో పాటు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పుస్తకాలు అందుబాటులో ఉంచడం, పఠన సంస్కృతిని పెంపొందించడం, గ్రంథాలయాల నిర్వహణలో సమన్వయంతో ముందుకు సాగడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.



## కోర్టు విధులు బహిష్కరించిన భద్రాచలం న్యాయవాదులు

**భద్రాచలం, మే 25 , డిడి9 వార్త**

భద్రాచలంలో సోమవారం భద్రాచలం బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు హైదరాబాద్‌లో న్యాయవాది ఖాజా మోయినుద్దీన్ హత్యకు నిరసనగా కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. అనంతరం న్యాయవాదులంతా సమావేశమై ఖాజా మోయినుద్దీన్‌కు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి మాట్లాడుతూ ఖాజా మోయిన్ ఉద్దీన్‌పై జరిగిన దారుణ హత్య యావత్ న్యాయవ్యవస్థకే తీరని లోటని, ఈ అమానుష ఘటనను బార్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో శాంతిభద్రతలను కాపాడేందుకు బాధితులకు న్యాయం చేకూర్చేందుకు నిరంతరం శ్రమించే న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత విచారకరమన్నారు. న్యాయవాదులు తాతా లలిత, పేరాల వెంకటేశ్వర్లు, బండారు అరుణ్‌చంద్, అవులూరి సత్యనారాయణ, భజన సతీష్, ఎం.వి. రమ, సాధనపల్లి సతీష్, పాయం రవివర్మ, ఎస్.మల్లేష్, దాట్ల సంధ్య, బి.రామకృష్ణ పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే సందర్శించాలి : రైతు సంఘం నేత పశ్యం పద్మ

**జనగామ మే 25(డిడి 9వార్త ) బ్యూరో**

జనగామ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తీవ్ర జాప్యం జరుగుతోందని, జిల్లా కలెక్టర్ తక్షణమే కేంద్రాలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలని పశ్యం పద్మ డిమాండ్ చేశారు.

సోమవారం జనగామ మండలం పెంబర్తి, రఘునాథపల్లి మండలంలోని కంచనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లారీల కొరత, తూకంలో ఇబ్బందులు, ధాన్యం తరలింపులో తీవ్ర ఆలస్యం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వర్షాల భయంతో తీవ్ర ఆందోళనలో ఉన్నామని మహిళా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

కంచనపల్లి కేంద్రంలో ఇప్పటి వరకు నాలుగు లారీల ధాన్యమే తరలించారని, ఇంకా 60 నుంచి 70 లారీల ధాన్యం నిల్వలో ఉందని రైతులు తెలిపారు. ధాన్యం తడిస్తే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పశ్యం పద్మ మాట్లాడుతూ సమస్యను రెవెన్యూ, వ్యవసాయ మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని, జిల్లా కలెక్టర్ నిర్లక్ష్యం వహిస్తే ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు.

సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ రైతులే గన్నీ సంచులు కొనుగోలు చేసి ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని విమర్శించారు. అధికారులు కేంద్రాల్లోనే ఉండి ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆది సాయన్న, జిల్లా కార్యదర్శి చొప్పరి సోమయ్య, రైతు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## గిరిజనులు గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

- **భద్రాచలం ఐటీడీఏ పీవో బి రాహుల్**



**భద్రాచలం, మే 25 డిడి9 వార్త**

గిరిజనులు గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ పేర్కొన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో పీవో రాహుల్ మాట్లాడుతూ మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాల నుండి వచ్చిన గిరిజనుల సమస్యల పరిష్కారంలో వివిధ శాఖల మధ్య యూనిట్ అధికారుల సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి వినతిపత్రాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల యూనిట్ అధికారులను ఆదేశించారు. తక్షణ పరిష్కారం సాధ్యమయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన యూనిట్ అధికారులకు సూచించారు. గిరిజన దర్బార్లో గిరిజనులు సమర్పించిన దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా ప్రత్యేకమైన రిజిస్టర్లో నమోదు చేసి, అర్హులైన ప్రతి గిరిజనులకు విడతలవారీగా ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, గురుకులం ఆర్ సి ఓ అరుణకుమారి, ఎస్ డి సి ఆనందకుమార్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏడిఎంహెచ్వో సైదులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భానుడి భగభగలు..

- **నిప్పుల కొలిమి లా భద్రాద్రి కొత్తగూడెం..**
- **ఉక్కపోత తో ప్రజలు ఉక్కిరి బిక్కిరి..**
- **రెడ్ జోన్ గా ప్రకటించిన వాతావరణ శాఖ..**
- **అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని సూచన..**



**మణుగూరు.మే 25 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా సూర్యభగవానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత వారం రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు అసాధారణంగా 45□C దాటి నమోదవుతుండడం తోపాటు తీవ్రమైన వడగాలులు వీస్తుండడంతో భద్రాద్రి జిల్లా వాసులు తీవ్రమైన ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఉదయం పది గంటల కల్లా రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయి ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఒకవైపు పరిశ్రమలు, మరోవైపు సింగరేణి బొగ్గుగనుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటల నుండే సూర్యుడు తన ప్రతాపాన్ని ప్రదర్శిస్తున్నాడు. రాత్రి 7 గంటలు అయినా కూడా వేడిగాలుల ప్రభావం తగ్గడం లేదు.దాంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిప్పుల కుంపటి గా మారింది. భానుడి భగభగలకు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. నిన్న ఒక్కరోజే తెలంగాణ రాష్ట్రంలో 42 మంది వడదెబ్బతో చనిపోయినట్టు సమాచారం. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు నిప్పులు కురిపిస్తుండటంతో బయటకు రావడానికి జనం భయపడిపోతున్నారు .ఈ ప్రభావంతో అధిక శాతం ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతుండడంతో రోజువారీ రద్దీగా కనిపించే మార్కెట్లు, ప్రధాన కూడళ్లు జన సంచారం లేక వెలవెల పోతున్నాయి. పగటి పూట వ్యాపారాలు పూర్తిగా స్థంభించిపోయాయని వ్యాపారస్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తోపుడుబండ్ల పై పండ్లు కూరగాయల తదితర వ్యాపారాలు చేసుకునే వారు,ఫుట్ పాత్ లపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది.నేటి నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండడంతో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత ఇంకా ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది.కొత్తగూడెం,మణుగూరు లాంటి సింగరేణి గనుల ప్రాంతాల్లో పగటి పూట ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతుండడంతో కార్మికులు వేడికి తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మజ్జిగ,ORS వంటివి త్రాగినా ఎండ వేడిమి నుండి ఉపశమనం లభించడం లేదని వారు వాపోతున్నారు.

అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని హెచ్చరికలు జారీ:

ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయని నేటి నుంచి రోహిణి కార్తె ప్రారంభం కానుండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు,డాక్టర్ లు తెలియజేస్తున్నారు.అత్యవసరం అయితే తప్ప ప్రజలు ఇళ్లనుండి బయటకు రావద్దని సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా తగినంత నీరు త్రాగుతూ పండ్లరసాలు, మజ్జిగ,ORS వంటివి తరచూ తీసుకుంటూ ఉండాలని పలు సూచనలు ఇస్తున్నారు. అలా చేయకపోతే ప్రజలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరించారు. ఒకవేళ ఎవరైనా వడదెబ్బకు గురి అయితే సకాలంలో గుర్తించి తగిన ప్రాథమిక చికిత్స అందించాలని సూచించారు.వడదెబ్బకు గురైన బాధితుల లక్షణాలను కొన్నింటిని వారు వివరించారు. శరీరం అధికంగా వేడెక్కడం, చమట పట్టడం ఆగిపోయి చర్మం పొడిగా, ఎర్రగా మారుతుంది,విపరీతమైన తలనొప్పి, కళ్ళు తిరగడం మరియు వాంతులు అవుతాయి. నాడి వేగంగా కొట్టుకుని గుండెదడగా అనిపించడం, స్పృహ కోల్పోవడం, లేదా మానసిక గందరగోళ పరిస్థితి మొదలగునవి.వడదెబ్బ తగిలిన బాధితుడిని వెంటనే చల్లని, గాలి బాగా తగిలే ప్రదేశంలో ఉంచాలి. వంటిపై ఉన్న దుస్తులను తొలగించి చల్లని నీటితో వొళ్ళు తుడవాలి. రోగి స్పృహలో ఉంటే చల్లటి మంచినీరు, మజ్జిగ,కొబ్బరినీరు లేదా ఎలెక్ట్రోలైట్ వంటి పానియాలు తాగించాలి.అత్యవసర వైద్య చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి.

ఈ విధంగా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ,వృద్ధులు చిన్నపిల్లల ఆరోగ్యం విషయంలో పలు జాగ్రత్తలు పాటిస్తూ సురక్షితంగా ఉండాలని వారు తెలియచేశారు.



# నల్లగుంట గ్రామ సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ

**డీ డీ 9 వార్త, ములుగు :**



వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో ఆదర్శ గ్రామైక సంఘాల ఆధ్వర్యంలో నల్లగుంట గ్రామ మహిళ సంఘానికి భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా భూమి పూజలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టిన గ్రామ గ్రామైక సంఘం సభ్యులు, గ్రామ సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ నాయక్,ఉప సర్పంచ్ మోరే లింగస్వామి,వార్డ్ మెంబర్ టి.శ్రీధర్,వివో సిసి భీమా నాయక్, గ్రామ పెద్దలు కొబ్బరికాయలు కొట్టి గ్రామ సంఘం భవన నిర్మాణ పూజలో పాల్గొన్నారు. అనంతరం సిసి భీమా నాయక్ మాట్లాడుతూ నల్లగుంట గ్రామంలో మొత్తం రెండు వివో సంఘాలు ఉన్నాయి.ఇందులో మొదటి వివోకు మంతెన రమ,రెండో వివో కు బల్ల నాగరాణి లు వివో లుగా ఉన్నారు.గ్రామంలో మొత్తం 528 మంది సభ్యురాలు ఉన్నారు. మొదటి వివో భవన నిర్మాణ భూమి పూజ సోమవారం రోజున జరుపుకోవడం జరిగింది. అలాగే గ్రామంలో రెండో వివో కు కూడా స్థలము ఉంటే భవన నిర్మాణం చేసుకోవచ్చని తెలిపారు. వెంకటాపూర్ మండలంలో మొత్తం 32 గ్రామ సంఘాలకు సోమవారం రోజున భూమి పూజ చేయడం జరిగింది. అలాగే గ్రామంలో స్థలం ఉంటే ఈజీఎస్ నిధుల ద్వారా గిడ్డండి ఏర్పాటు చేసుకోవచ్చు అని తెలిపారు.అలాగే నల్లగుంట గ్రామంలో ఈజీఎస్ నిధుల ద్వారా 10 లక్షల రూపాయల నిధులతో మంజూరైన గ్రామ సమైక్య భవన నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగిందనీ తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ సమైక్య భవనం ద్వారా మహిళా సంఘాలు స్వయం సహాయక సంఘాలు గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు ఒక కేంద్రంగా మారుతుందని, అలాగే భవన నిర్మాణం పూర్తయ్యాక గ్రామానికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా శ్రీదేవి శంకర్ నాయక్,ఉపసర్పంచ్ మోరె లింగస్వామి,వార్డ్ మెంబర్ టి.శ్రీధర్,గ్రామ సమాఖ్య సిసి భీమా నాయక్,వివో మంతెన రమ,అధ్యక్షులు పిన్ రెడ్డి సునీత, కార్యదర్శి స్వప్న, కోశాధికారి సుజాత, సహకారదర్శి లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు సావిత్రి, మహిళా సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పాలీసెట్ లో సత్తా చాటిన రాహుల్ విజ్ఞాన్ విద్యార్థి

**చర్ల, మే 25 (డిడి 9వార్త)**





తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యామండలి నిర్వహించిన టీజీ పాలీసెట్ 2026 ఫలితాల్లో చర్ల మండల కేంద్రంలోని రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం పదో తరగతి విద్యార్థి పందిరి నిషాంత్ రెడ్డి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించి పాఠశాలకు, చర్ల మండలానికి ఘన కీర్తిని తెచ్చిపెట్టాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో నిషాంత్ రెడ్డి అసాధారణ ప్రతిభ కనబరిచి, ఎంబైపీసీ (అగ్రికల్చర్) విభాగంలో రాష్ట్రస్థాయిలో 678వ ర్యాంక్ కైవసం చేసుకుని సత్తా చాటాడు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించిన నిషాంత్ రెడ్డిని సోమవారం రాహుల్ విజ్ఞాన్ విద్యాలయ వ్యవస్థాపకులు డాక్టర్ డి.యన్. కుమార్, డాక్టర్ ప్రతిభ, పాఠశాల ఎడ్యుకేషనల్ డైరెక్టర్ టి.వి.పి.సి. శాస్త్రి నిషాంత్ రెడ్డికి తమ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ జి. వర్మ రాజు, కొసరాజు హరిచరణ్, వైస్ ప్రిన్సిపాల్ యం.వి.యల్. నరసింహారావు, ఉపాధ్యాయులు బిట్రగుంట క్రాంతికుమార్, అద్దంకి బోసు బాబు, ఉపాధ్యాయ బృందం అంతా కలిసి నిషాంత్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వదించారు. మా పాఠశాల విద్యార్థి నిషాంత్ రెడ్డి మొదటి నుండి చదువులో ఎంతో క్రమశిక్షణ, పట్టుదల గల వాడని, ఉపాధ్యాయుల నిరంతర మార్గదర్శకత్వాన్ని పాటిస్తూ చదివి పదవ తరగతి లో 573 మార్కులతో మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడమే కాకుండా ఇప్పుడు పాలిటెక్నిక్ లో రాష్ట్రస్థాయిలో 678వ ర్యాంక్ సాధించడం రాహుల్ విజ్ఞాన్ విద్యాలయానికే కాకుండా చర్ల మండల ప్రజలందరికీ ఎంతో గర్వకారణమని ఉపాధ్యాయిలు తెలిపారు. భవిష్యత్తులో నిషాంత్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థి తల్లిదండ్రులు, తోటి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని నిశాంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియ జేశారు.

# నిర్మాణం సరే... అనుమతుల మాటేమిటి సారు..?

- **బుద్వేల్ గ్రీన్ సిటీలో భారీ భవన నిర్మాణం**
- **అనుమతులపైఅనుమానాల మేఘాలు**
- **టౌన్ ప్లానింగ్ అధికారులు చూస్తూ ఊరుకుంటున్నారా..?**
- **నిబంధనలు పక్కన పెట్టి యథేచ్ఛగా పనులు కొనసాగుతున్నాయంటూ స్థానికుల ఆగ్రహం**

**రాజేంద్రనగర్ మే 25 డిడి 9 వార్త**



రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ గ్రీన్ సిటీ కాలనీలో నిర్మాణంలో ఉన్న భారీ బహుళ అంతస్తుల భవనం ఇప్పుడు స్థానికంగా హాట్ టాపిక్‌గా మారింది.నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా..? లేక అధికారుల కనుసన్నల్లోనే అక్రమంగా నిర్మాణం సాగుతోందా..? అనే ప్రశ్నలు కాలనీవాసుల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.కాలనీ మధ్యలో భారీ స్థాయిలో నిర్మాణం జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం స్పందించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. పార్కింగ్ స్థలం,రహదారి వెడల్పు,భద్రతా ప్రమాణాలు, ఫైర్ సేఫ్టీ వంటి కీలక నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగుతోందని ఆరోపిస్తున్నారు. అన్ని అనుమతులు ఉంటే అధికారులు ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదు..? అక్రమం కాకపోతే బహిరంగంగా వివరాలు వెల్లడించడంలో సమస్య ఏమిటి..?" అంటూ కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణం పేరుతో నివాస ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా భవనాలు కట్టేస్తే భవిష్యత్తులో ట్రాఫిక్, పార్కింగ్,డ్రైనేజీ సమస్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి నిర్మాణ అనుమతులపై పూర్తి వివరాలు వెల్లడించాలని, నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నట్లు తేలితే వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



# అంగన్ వాడీ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు

**భద్రాచలం, మే 25 డిడి9 వార్త**

గర్భిణులు, బాలింతలు. చిన్న పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించడమే ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు ముఖ్య ఉద్దేశమని భద్రాచలం సెక్టార్ సిడిపిఓ జ్యోతి అన్నారు. సోమవారం నాడు భద్రాచలం సెక్టార్ పరిధిలోని ఎస్ ఆర్ ఎన్ కాలనీ అంగన్ వాడీ కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దైనందిన జీవితంలో స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, పోషకాలతో కూడిన ఆహారాన్ని భాగం చేసుకోవాలని ఆమె తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం కేంద్రానికి వచ్చిన తల్లులందరితో పిల్లల ఆరోగ్యం, సంరక్షణ మరియు సరైన పోషణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సెక్టార్ పరిధిలోని సూపర్‌వైజర్ అనసూయ, చంద్రకళ ,అంగన్ వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.




# ఫీజుల దోపిడీపై పిడిఎస్ యూ సమరభేరి

- **తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి**

**భద్రాచలం , మే 25 , డిడి9 వార్త**

రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతమయ్యాయి. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలో పిడిఎస్ యూ భారీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించింది.

**ప్రభుత్వంపై విమర్శలు**

ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా కార్యదర్శి మునిగేలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ.. విద్యా వ్యవస్థను కార్పొరేట్ శక్తులు తమ గుప్పిట్లోకి తీసుకున్నాయని మండిపడ్డారు. శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యా సంస్థల నుంచి వచ్చే ఎలక్టోరల్ బాండ్లు, భారీ ఫండ్స్ కారణంగా ప్రభుత్వాలు వాటిని నియంత్రించే సాహసం చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వాలే విద్యా సంస్థల కనుసన్నల్లో నడుస్తున్నాయని, దీనివల్ల సామాన్య, మధ్యతరగతి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక భారానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అడ్డగోలుగా ఫీజుల పెంపు**

ఏటా ఎటువంటి అనుమతులు లేకుండానే పాఠశాలలు, కళాశాలలు 25 నుంచి 50 శాతం మేర ఫీజులు పెంచుతున్నా, క్షేత్రస్థాయిలో ఉన్న ఎంఈఓలు, డిఈఓలు, ఆర్ జేడీలు పట్టించుకోవడం లేదని, పైగా అక్రమ అనుమతులకు కొమ్ము కాస్తున్నారని శివ ప్రశాంత్ విమర్శించారు. ఫీజులు పెంచే అధికారం యాజమాన్యాలకు కాకుండా, తల్లిదండ్రుల కమిటీలకు ఉండాలని, వారి ఆమోదం తప్పనిసరి చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

సంతకాల సేకరణ ద్వారా సేకరించిన ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి నివేదిస్తామని, ఈ సమస్య పరిష్కారమయ్యే వరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని పిడిఎస్ యూ నాయకులు స్పష్టం చేశారు. విద్య అనేది వ్యాపారం కాదని, అది ప్రతి విద్యార్థి ప్రాథమిక హక్కు అని వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా కమిటీ సభ్యులు రామ్ చరణ్, ఏవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాధనపల్లి సతీష్, జిల్లా కమిటీ సభ్యులు వాసు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి. మరో ఇద్దరికి గాయాలు..

**మణుగూరు.మే 25 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా, మరోఇద్దరు గాయపడ్డారు.మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరి నగర్ కు చెందిన వృతిక్ (20) అఖిల్ బన్ని తో కలిసి స్కూటీపై వెళుతుండగా చిక్కుడుగుంట వద్ద భద్రాద్రి పవర్ ప్లాంట్ సమీపంలో గల కల్వర్టు ను ఢీ కొట్టారు. వృతిక్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా ఇద్దరినీ అంబులెన్స్ వాహనంలో మణుగూరు ఏరియా హాస్పిటల్ కు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తుంది.

# జాతీయ ఎస్ సి, కమిషన్ సభ్యున్ని మర్యాదపూర్వకంగా బి జె పి, నాయకులు.

**డిడి9వార్త / పెద్దపల్లి మే 26:**



జాతీయ ఎస్ సి కమీషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ ని 8వ కాలనీ బీజేపీ నాయకులు ఎన్టీపీసీ గెస్ట్ హౌస్ లో మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది. సింగరేణి లో నెలకొన్న సమస్యల గురించి వివరించడం జరిగింది. వారు కూడా సమస్యల గురించి సానుకూలంగా స్పందించడం జరిగింది..ఈ కార్యక్రమంలో 8వ కాలనీ బీజేపీ మండల అధ్యక్షులు ఆకుల శశి కుమార్,బీజేవైఎం మండల అధ్యక్షులు ఐలవేని అనిల్ కుమార్ పాల్గొన్నారు.



# గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన

- **మొద్దులగూడెం అంగన్వాడీ కేంద్రంలో "99" రోజుల ప్రణాళికలో భాగంగా ఆహార ప్రదర్శన**

**గోవిందరావుపేట, మే 25 (డి డి 9 వార్త)**

పస్రా గ్రామపంచాయతీ పరిధిలోని మొద్దులగూడెం అంగన్వాడీ కేంద్రంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆహార ప్రదర్శన చేపట్టి, సామాన్య ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే అధిక పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించడంతో పాటు ఇంట్లోనే సులభంగా తయారు చేసుకునే వంటకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆకుకూరలతో గారెలు, పల్లి పట్టీలు, బెల్లంతో స్వీటన్నం, బాలామృతంతో హల్వా, పాలతో సేమియా వంటి పోషకాహార వంటకాలను తయారు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయినులు రజిత, సునీత, విజయ, ఆయాలు స్వప్న, ఆశా కార్యకర్త మరియమ్మతో పాటు తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. పోషకాహారంపై గ్రామీణ మహిళల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.





# వడ దెబ్బ బాధితులకు తక్షణ సహాయం అందించాలని మేయర్ ఆదేశాలు

**డిడి9వార్త / రామగుండం మే 26:**

వడ దెబ్బ బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ఆసుపత్రి సిబ్బంది సదా సిద్దంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. ఇటీవల ఎండల తీవ్రత తో వడ దెబ్బ బారిన పడి ప్రజలు అస్వస్థత గురవడం , వరుస మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో మేయర్ సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వడ దెబ్బ బాధితులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. వార్డులలో తిరుగుతూ రోగులతో మాట్లాడి అనంతరం వైద్యులతో సమీక్షించారు.

ఈ సంధర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. వైద్యులు ఉదయం 10 గం . నుండి 12 గం వరకు మాత్రమే ఆసుపత్రిలో ఉంటున్నారని , వివిధ విభాగాల అధిపతులు అందుబాటులో ఉండడం లేదని రోగులు ఫిర్యాదు చేశారు . నీటిని శుద్ధి చేసే యంత్రాలు , చాలా చోట్ల ఫ్యాన్లు , కూలర్లు పని చేయడం లేదని , ఐ సి యు , అత్యవసర వార్డులలో లో ఎ సి లు పని చేయడం లేదని తెలిపారు . కాగా కొత్తగా 10 కూలర్లు , 20 ఫ్యాన్లు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. వడ దెబ్బ ప్రబావాన్ని తగ్గించడానికి స్ప్రింక్లర్ లు లేవని అన్నారు. ఎం ఆర్ ఐ స్కానింగ్ అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కొన్ని రకాల మందులు ప్రభుత్వం నుండి సరఫరా కాకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో బయట కొనుక్కోవాలని సూచిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

మేయర్ స్పందిస్తూ వైద్య సేవలు మెరుగుపరచడానికి ఆసుపత్రికి అవసరమైన వాటి గురించి లిఖిత పూర్వకంగా ఇస్తే ఎం ఎల్ ఎ , జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మునిసిపల్ కార్పొరేషన్ నుండి అందించవల్సిన సేవలను తప్పని సరిగా ఇస్తామని అన్నారు. ఆసుపత్రిలో అత్యవసరమైన చోట టవర్ ఎ సి లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అన్నారు. ఎండల కారణంగా నగరంలో పరిస్థితి తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఆసుపత్రిలో అన్ని వేళలా వైద్యులు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఎక్కువ మంది వైద్యులు గైర్హాజరు అవుతున్నవిషయం ఈ రోజు తన సందర్శనలో ప్రత్యక్షంగా గమనించానని అది పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. ఫోన్ కాల్స్ కు వైద్యులు స్పందించాలని అన్నారు. ప్రైవేట్ ప్రాక్టీస్ కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు అందించే వైద్య సేవలపై దృష్టి సారించాలని అన్నారు. వడ దెబ్బ నుంచి ఉపశమనం కల్గించే ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు ఆసుపత్రి తో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేక ఎ సి గదులు , అంబులెన్స్ అందుబాటులో ఉండాలని అన్నారు. వార్డులలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంధర్భంగా కార్పొరేటర్ ముస్తాఫా, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ ఎం ఓ రాజు , వైద్యులు అశోక్ , అజయ్ , స్వప్న లత తదితరులు ఉన్నారు.

## దుమ్ము ధూళి కణాల నివారణ తో పాటు పలు రకాల

# సమస్యలు పరిష్కరించాలి..

- **ఓ.సి 4 యాక్టింగ్ మేనేజర్ కె వినోద్ కుమార్ కు వినతి పత్రాన్ని అందచేసిన ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**



**మణుగూరు.మే 25**

(డి డి 9వార్త ) భద్రాద్రి జిల్లా ,మణుగూరు ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్ 4 నందు విపరీతమైన దుమ్ము, ధూళి కాలుష్యం ఎగసి పడుతుందని సూక్ష్మ ధూళి రక్కసి వల్ల కార్మికులు, అధికారుల ఆరోగ్యం దెబ్బతిని ఆ ప్రభావం సంస్థ ప్రగతి పై పడే ప్రమాదం ఎక్కువగా ఉందని యుద్ధ ప్రాతిపదికన గని ప్రాంగణంలో డస్ట్ కంట్రోల్ నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని గని యాక్టింగ్ మేనేజర్ కె.వినోద్ కుమార్ కు గని ఫిట్ సెక్రటరీ నరేష్ అధ్యక్షతన ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు, నాయకులు సోమవారం నాడు వినతి పత్రాన్ని అందచేశారు.

అందులో పలు రకాల సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కార మార్గం చూపాలని కోరారు. గని నందు సూపర్ వైజర్, టెక్నిషియన్స్ కొరతతో పాటు జనరల్ అసిస్టెంట్ ల కొరత కూడా తీవ్రంగ ఉందని, దానివల్ల మిగతా కార్మికులపై పనిభారం పెరిగి ఆ ప్రభావం రక్షణ నియమాల ఉల్లంఘనకు దారి తీస్తుందని, సరిపడా మ్యాన్ పవర్ ను అందుబాటులో ఉంచాలని కోరారు. కన్వేయన్స్ వాహనాలు సరిపడా లేవు,ఉన్న వాహనాలకు ఫిట్ నెస్ లు సరిగా ఉండక మొరాయిస్తు ఉండటం మూలంగా సంస్థ విలువైన సమయం వృధా అయి కార్మికులు సకాలంలో పని ప్రదేశాలకు చేరుకోలేక పోతున్నారని,ఆ ప్రభావం పనిపై పడి ఒత్తిడి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కూర్చోవడానికి కనీస సౌకర్యాలు లేని ఇతర ప్రైవేట్ కంపెనీల వాహనాలల్లో సర్వే డిపార్ట్ మెంట్ కార్మికులను క్వారీలో పనులకు పంపడం వల్ల వారంతా అనేక అవస్థలు, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ వాహనాల మూలంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. వాహనాల ద్వారా క్వారీలో దింపిన కార్మికులను పనుల ముగింపు తర్వాత కన్వేయన్స్ వాహనాలు సకాలంలో పంపక పోవడం మూలంగా కార్మికులు నడుచుకుంటూ ఉపరితలంపైకి వస్తు అస్వస్థతకు గురి అవుతున్నారని తెలిపారు. గని ప్రాంగణంలో తాగు నీటి సరఫరా కోసం 04 ఫ్రిజ్ లు ఏర్పాటు చేసినప్పటికి అందులో ఒక ఫ్రిజ్ మాత్రమే కూల్ వాటర్ సరఫరా చేస్తుందని మిగతా 03 ఫ్రిజ్ లు పలు రకాల కారణాల వల్ల పని చేయడం లేదని, దాని మూలంగా కార్మికులు చల్లటి తాగు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లాంప్ రూమ్ లో సుమారు 40 కి పైగా క్యాప్ లాంప్ లు ఉన్నప్పటికీ అందులో సుమారు 08 మాత్రమే పని చేసే విధంగా ఉన్నాయని సరిపడ పనిచేసే క్యాప్ లాంప్ లు లేకపోవడం మూలంగా సెకండ్ నైట్ షిఫ్ట్ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైర్లెస్ సెట్ ప్రాముఖ్యత క్వారీలో ఎంతో ఉన్నప్పటికీ ఏ ఒక్కటి కూడా సరిగా పని చేయక పోవడం వల్ల కార్మికులతో పాటు అధికారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. లెట్రిన్ ట్యాంక్ లు నిండి దుర్వాసన వెదజల్లుతుంది లెట్రిన్ గదులలో గాలి వెలుతురు ప్రసరింప చేయడానికి కిటికీలు లేవు.టాయిలెట్ క్లీనింగ్ లు సరిగా లేక దుర్వాసన వస్తుండడం వల్ల కార్మికులు మైగ్రేషన్ నొప్పులకు గురి అవుతున్నారని తెలిపారు. డస్ట్ కంట్రోల్ నాణ్యత ప్రమాణాల మాస్క్ లు అందించాలని కార్మికుల గదులలో చేరిన దుమ్ము ధూళి కణాలను క్లీనింగ్ చేయించాలని తెలిపారు సంస్థకు కార్మికులే ఆస్తి అని వారి ఆరోగ్యం కాపాడితేనే సంస్థ ప్రగతి సాధ్యం అవుతుందని, ఓ.సి 4 లో నెలకొని ఉన్న ప్రధాన సమస్యలు ఎక్కువగా కార్మికులు ,అధికారుల ఆరోగ్యం పై ప్రభావం చూపే విధంగా ఉన్నందున సంస్థ ప్రగతి, కార్మిక ఆరోగ్య సంక్షేమంను కార్పొరేట్ యాజమాన్యం, స్థానిక యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనమా రామకృష్ణ ధారావత్ కృష్ణ, థామస్ కె. రమేష్ బాబు, వీర బాబు, శ్రీనివాస్, నవీన్ కుమార్, వినీత్ కుమార్, సాయి కుమార్ పాల్గొన్నారు.

# డీ సీల్టేషన్ ను రద్దు చేయాలి

- సొసైటీల ద్వారా పాత పద్ధతిలోనే ఇసుక ర్యాంపుల నిర్వహణ జరపాలి.
- ఏజెన్సీ వనరుల ఆదాయాన్ని ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కేటాయించాలి.
- తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్...



**మే25 డిడి 9 వార్త వెంకటాపురం.**

ఏజెన్సీ అడవులలోని ఖనిజ సంపదను, సహజ వనరులను బడా కార్పోరేట్ శక్తులకు, పెట్టుబడుదారులకు తాకట్టు పెట్టి, ఆదివాసి గిరిజన అభివృద్ధి అంధకారంలోకి నెట్టేలా,కేంద్రంలోని బిజెపి రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలో వ్యవహరిస్తున్నాయని, తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్ అన్నారు. ఆలుబాక కేంద్రంలో జరిగిన తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం మండల మహాసభకు హాజరై మాట్లాడుతూ, దేశంలోని మోదీ ప్రభుత్వం తన మిత్రులైన అదానీ, అంబానీ, బడా పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చేందుకు, దేశంలోని అడవి ప్రాంతాలలో దాగి ఉన్న ఖనిజసంపదను కొల్లగొట్టేందుకు, వేల ఎకరాల అడవులను గుండు గుత్తాగా ధారధత్తం చేస్తున్నారని, తద్వారా ఏజెన్సీ 1/70,పేసా చట్టాలు,అటవీ సంరక్షణ,జంతు వన్య ప్రాణుల సంరక్షణ చట్టాలన్నీ నిర్వీర్యం అవుతున్నాయని అన్నారు. అటవీ సంపదను దేశ మూలవాసులకు, ప్రజలఅభివృద్ధికి ఉపయోగించి, ప్రజల జీవన ప్రమాణాలు మెరూపరచాల్సిన ప్రభుత్వాలు దేశంలోని బడా పెట్టుబడిదారుల లాభాల కోసం పనిచేస్తూ దేశ ప్రజలను, ఆదివాసీల అస్తిత్వాన్ని కనుమరుగయ్యేలా పాలక ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ ఆదివాసి గ్రామాలలో కనీస మౌలిక అవసరాలు (రోడ్లు,నీరు, కరెంటు,విద్య, వైద్యం )కల్పించడంలో ప్రభుత్వాలు విఫల మవుతున్నాయని,ఏజెన్సీ వనరుల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆదివాసులకు ఖర్చు చేయకుండా, రాష్ట్రంలోని ఇతర అవసరాల కోసం ఖర్చు పెడుతూ ఆదివాసీలను మోసం చేస్తున్నాయని అన్నారు. ఏజెన్సీ వనరుల ఆదాయాన్ని ఏజెన్సీ ప్రాంతా అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీతారామ ప్రాజెక్టు పేరుతో వెంకటాపురం మండలంలో లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను దోపిడికి ప్రభుత్వ యంత్రాంగ దొంగలు పూనుక్కున్నారని, డి సిల్టేషన్ పేరు చెప్పి వెంకటాపురం మండలంలో అనుమతులు లేని సుమారు 15 కిలో మీటర్ల మేర గోదావరిలో ఇసుకను కొల్లగొట్టేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఇసుక దోపిడి మాఫియాలు పూనుకున్నాయని, డీ సీల్టేషన్ వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి, మండలంలోని ఆదివాసి,ఇతర పేద రైతుల వ్యవసాయాలకు, త్రాగు, సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడతాయని, భవిష్యత్ తరాలకు వారి జీవ వైవిధ్యం ప్రమాద పరిస్థితుల్లోకి నెట్టవేయబడతాయని, వెంటనే డిసిల్టేషన్ ద్వారా ఇసుక రవాణా చేసే ప్రయత్నాలను రద్దుచేసి, పాత పద్ధతిలోనే సొసైటీల ద్వారా ఇసుక ర్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆదివాసి ప్రజానీకాన్ని ఏకం చేసి ప్రత్యక్ష పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు.అనంతరం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం వెంకటాపురం నూతన మండల కమిటీని,అధ్యక్షులుగా పూనెం చందు, కార్యదర్శిగా కాపుల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.ఈకార్యక్రమంలోసంఘం మండల కమిటీ సభ్యులు,ఇర్ప శ్రీను, కుంజ నారాయణ, కొర్స వంశి, సోలం నరసింహస్వామి, మిడం నాగేష్, మడకం చంద్రరావు బొగ్గుల వెంకట నారాయణ పాల్గొన్నారు.

# ఘనంగా 26వ వాడబలిజ ఆవిర్భావ దినోత్సవం..

**మే25 డిడి9 వార్త వెంకటాపురం.**

వాడ బలిజ 26వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ



వెంకటాపురం మండలం వి ఆర్ కే పురంలో వాడ బలిజ సంఘం 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డర్ర దామోదర్ జెండాను ఆవిష్కరించి రాష్ట్ర ప్రజలందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడ బలిజ కులస్తులు అందరూ ఐక్యంగా ఉండి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2001 సంవత్సరంలో కుల పెద్దలు, మేధావులు, సీనియర్ నాయకులు కలిసి వాడ బలిజలకు ప్రత్యేక సంఘం అవసరమని భావించి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారిని కలిసి సంఘం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు సమర్పించారని తెలిపారు.

దానిని పరిశీలించిన ప్రభుత్వం 2001 మే 25న సంఘాన్ని అధికారికంగా నమోదు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ప్రతి సంవత్సరం మే 25న ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వాడ బలిజ యువత సంఘం అభివృద్ధి కోసం కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు తోట ప్రశాంత్, కొప్పుల మల్లికార్జున్, బద్ది ఆదినారాయణ, బొగట విజయ్, బొగట పవన్, సనగుండ వెంకన్న, ఎస్ వెంకటేశ్వర్లు, సనగుండ పోతురాజు, రానబోయిన నాగేంద్రబాబు, టేకుల దామోదర్, నరేష్, సతీష్, నాగార్జున, శ్రీను, నాగేష్, అంజయ్య, రామారావు, లీల నవీన్, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

# పోరు కేక ను చెయ్యండి విజయవంతం

**చర్ల, మే 25 (డిడి 9 వార్త )**



చర్ల మండల కేంద్రంలో సోమవారం తుడుందెబ్బ కార్యాలయ ప్రాంగణంలో గోండ్వాన సంక్షేమ పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు వాసం ముసలయ్య మాట్లాడుతూ జూన్ 3 న పాకాల కొత్తగూడ లో జరిగే పోరు కేక కు ఆదివాసీ ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. 1976 లో అక్రమంగా కలిపిన లంబాడి, సుగాలి, బంజారాలు మన రిజర్వేషన్ లను దోచుకోవడమే కాక మన అస్థిత్వాన్ని దోచుకునే విధంగా తయారయ్యారని 1976 లో కూడా వాళ్లని డీనోటిపై ట్రైబ్స్ గా పరిగణించారని అలాగే మన ఆదివాసీ అస్తిత్వాన్ని రాజకీయ పదవులను రిజర్వేషన్ ను అక్రమంగా దోచుకుంటూ ఆదివాసీ జాతి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నారు. ఈ విషయంపై గతంలో భద్రాచలం వేదికగా ధర్మ యుద్ధంతో సమర శంఖం పూరిచించిన, ప్రభుత్వాలు మాత్రం ఆదివాసీలపై సవతి ప్రేమ చూపిస్తున్నయని మండిపడ్డారు. గత 50 ఏళ్లుగా మా రిజర్వేషన్ పొందుతున్న ఆదివాసీ జాతి ఎన్నో పోరాటాలు చేస్తున్న నిమ్మకు నీరెత్తుత్తన్నట్టుగా ప్రభుత్వాలు,పాలకులు ఒంటెద్దు పోకడ పోతున్నాయని మండిపడ్డారు. జూన్ 3న జరిగే పోరు కేక లో మన ఆదివాసుల బలమేంటో చూపించాలని, అదేవిధంగా లంబాడీలను తరిమి కొట్టేంతవరకు మా ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వాలకు కూడా తెలిసి వచ్చేలాగా ఆదివాసీ ప్రజలందరూ ఏకమై పాకాల కొత్తగూడా లో జరిగే పోరు కేక కు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు తాటి రామకృష్ణ, తాటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



# స్వయం సహాయక సంఘ భవనాలకు శంకుస్థాపన

- ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళలకు ప్రభుత్వం ఆర్థిక చేయూత

**బోనకల్,మే 25,(డీడీ9 వార్త):**

ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు స్వయం సహాయక సంఘాల భవనాలకు మండలంలోని బోనకల్,చిరునోముల, రావినూతల,జానకిపురం,పెద్ద బీరవల్లి,చిన్నబీరవల్లి,రాపల్లి,బ్రాహ్మణపల్లి,కలకోట,లక్ష్మీపురం గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్ లు సీసీల ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేశారు,ప్రతి గ్రామంలో స్వయం సహాయక సంఘ భవన నిర్మాణం చేపట్టాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయా పంచాయతీలలో గ్రామ సంఘ భవన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి పిలుపు మేరకు గ్రామంలో పండుగ వాతావరణంలో శంకుస్థాపనలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎపిఎం వెంకటేశ్వర్లు,మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఆయా గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచ్ లు,వార్డ్ మెంబర్లు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యూరియాకు ప్రత్యామ్నాయాలు

**రాజేంద్రనగర్ మే 25 డిడి 9 వార్త**



గత పది,పదిహేను సంవత్సరాల నుండి ఇతర ఎరువులతో పోలిస్తే యూరియా చౌకగా లభ్యమౌతున్నందువలన వివిధ పంటలలో యూరియా వాడకం ఇటీవల గణనీయంగా పెరిగింది.దీని వలన దిగుబడులో పెద్ద మార్పు లేనప్పటికీ ఇతర ఆరోగ్య, వాతావరణ సమస్యలకు అధిక యూరియా వాడకం ప్రధాన కారణమైంది.ఈ నేపథ్యంలో గల్ఫ్ యుద్ధ ప్రభావం వలన ఒకవేళ యూరియా సరఫరా తగ్గినట్లైతే దాని ప్రభావం పెద్దగా ఉండదని ఎందుకంటే రైతాంగానికి యూరియాకి ప్రత్యామ్నాయ మార్గాలు చాలా ఉన్నాయని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ జానయ్య తెలిపారు.యూరియా పై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కొందరు దీనిపై చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని ఈ సందర్భంగా రైతులకు సలహా ఇచ్చారు.ఒకవేళ యూరియా సరఫరా రైతులు ఆశించినంత లభ్యం కానట్లైతే సుమారుగా అదే ధరలతో నానో యూరియా మార్కెట్లో కావలసినంత పరిమాణంలో అందుబాటులో ఉన్నదని ఆయన తెలిపారు. నానో యూరియా వాడకం వలన కూడా మొక్కలకు కావలసిన నత్రజని అందించటం వలన యూరియా వాడకం ద్వారా వచ్చే ఫలితాలే నానో యూరియా వలన వస్తాయని ఆయన తెలిపారు.అంతేకాకుండా భారత ప్రభుత్వంచే ధృవీకరించబడిన జీవన ఎరువులు కూడా మార్కెట్లోకి అందుబాటులోకి వచ్చాయని వాటిని కూడా యూరియాకి ప్రత్యామ్నాయంగా వాడవచ్చని ఆయన సలహా ఇచ్చారు.వీటితో పాటు పచ్చిరొట్ట విత్తనాలను రైతాంగం సేకరించి తొలకరి వర్షాలు రాగానే పొలాలలో చల్లి,విత్తిన 40 రొజులలో ఆయా పంటలను పొలంలో కలియదున్నినట్లైతే నేలలో సేంద్రియ కర్బనం పెరిగి నేల ఆరోగ్యం బాగుంటుందని ఆయన తెలిపారు. వీటితోపాటు పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్నినో ప్రభావం వలన ఈ సంవత్సరం వర్షపాతం కొంచెం తగ్గే అవకాశం ఉన్నందున బోరు ,బావులు,చెరువుల క్రింద వరికి బదులు పప్పుదినుసులు లేదా నూనెగింజల పంటలతో పాటు ఇతర మెట్టపంటలు వేసుకున్నట్లైతే వాటికి యూరియా వాడకం పెద్దగా అవసరం ఉండదని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఈ సందర్భంగా రైతులు యూరియాకు ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని సలహా ఇచ్చారు.ఈ పరిస్థితులను ఒక సదవకాశంగా వాడుకుని పంట మార్పిడి వైపు రైతాంగం మొగ్గు చూపాలని తద్వారా ప్రజల ఆరోగ్యంతో పాటు రైతులకు కూడా ఆదాయం పెరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు.